క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్ : మంగళగిరి పట్టణ, రూరల్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ జి.సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర మరమ్మతుల కారణంగా నవులూరు గ్రామంలోని ఈఎస్ఆర్ గార్డెన్స్, గోలివారి తోట, మక్కెవారి పేట, బాపనయ్య నగర్ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు, డోలాస్ నగర్ పరిధిలోని 132 కేవీ లైన్ కండక్టర్ మార్పు నిమిత్తం డోలాస్‌నగర్, ప్రకాష్ నగర్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఫిరంగిపురం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ యానీగ్రేస్ అన్నారు. మండలంలోని పొనుగుపాడు, వేమవరం గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. వర్షాలు పడుతుండటంతో ఆహారం వేడిగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వారంలో ఒ కరోజు ఫ్రిడ్జ్‌లు శుభ్రం చేసుకోవాలని, మంచినీటి బిందెలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కాలువల్లో మురుగు నిలబడకుండా చూడాలని లేకుంటే దోమలు వృద్ధి చెంది మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి రోగాలు వస్తాయని తెలిపారు. శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఏఎన్‌ఎంలు విజయరాణి, ఏసమ్మ, మేల్ అసిస్టెంట్లు రాజశేఖర్, నరసింహారావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోలీసు పికెట్



ఫిరంగిపురం: మండలంలోని గొల్లపాలెం గ్రామంలో గడిచిన ఐదు రోజులుగా పోలీసు పికెట్ కొనసాగుతున్నట్లు సీఐ రవీంద్రబాబు సోమవారం తెలిపారు. గతవారం ఒక కేసు విషయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం గ్రామంలో నెలకొంది. దీంతో 25 మంది సిబ్బందితో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసామన్నారు. శాంతిభద్రతలు గ్రామంలో నెలకొనే వరకు కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లిరూరల్ : రానున్న మూడు రోజుల్లో గుంటూరు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ముందస్తు సమాచారం అందించేందుకు ఎంటీఎంసీ నుండి ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముంపునకు గురయ్యే ప్రాంత ప్రజలు ప్రత్యేక కాల్ సెంటర్ నంబర్లు 70939 12653, 0864 5295193 కాల్ చేసి ముందస్తు సమాచారం అందజేస్తే, తగు పరిష్కార చర్యలు తీసుకుంటామని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

ఆవుల యజమానులకు హెచ్చరిక

సాక్షి ఎఫెక్ట్

తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలో రోడ్లపై ఆవుల సంచారంపై సోమవారం సాక్షి పత్రికలో వెలువడిన 'ఆలోచించండి – ఆవులను తోలుకెళ్లండి శీర్షికన కథనానికి ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా స్పందించారు. మరోసారి పత్రికా ప్రకటన విడుదల చేశారు. గతంలో మంగళగిరి పట్టణ ప్రాంతంలోని ఆవుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి, రోడ్లపై ఆవులను వదలడానికి వీలులేదని తెలియజేశామని పేర్కొన్నారు. అయినా ఆవులను రోడ్లపై వదులుతున్నారని, నోటీసులు జారీ చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. ఆవుల వల్ల వాహనదారులకు, పాదచారులకు ఎంతో ఇబ్బంది కలగడమే కాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇకపై యజమానులు ఆవులను రోడ్లపై వదిలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఆ ప్రకటనలో హెచ్చరికలు జారీ చేశారు.

హోంగార్డుల సహకారం అభినందనీయం



నగరంపాలెం: జిల్లాలోని హోంగార్డులు ఐక్యంగా ఒక రోజు వేతనాన్ని అందించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఆగస్టు 5న గ్లోరీ ఫ్లారెన్స్ అనే మహిళా హోంగార్డు ఉద్యోగ విరమణ పొందారు. హోంగార్డులు అందించిన రూ.2.27 లక్షల చెక్కును ఆమెకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అందించారు. జిల్లా హోంగార్డు ఆర్ఐ శ్రీనివాసరావు, ఏఆర్ ఆర్ఎస్ఐ రత్నరాజు పాల్గొన్నారు.

పల్లెల ప్రయాణం నరకప్రాయం

- చినుకుపడితే గోతుల మయం
- రాత్రిళ్లు తప్పని ప్రమాదాలు
- మరమ్మతులు చేయాలంటున్న గ్రామీణులు



గోతుల మయంగా మునగపాడు రహదారి



వర్షానికి గోతులు పడిన గుండాలపాడు రోడ్డు

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల రహదారులు అధ్వానంగా ఉన్నాయి. బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంటూరు –కర్నూలు రాష్ట్ర రహదారి నుంచి మునగపాడు వెళ్లేందుకు వీలుగా ఉన్న మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. దీనిని 15 ఏళ్ల కిందట స్పిన్నింగ్ మిల్లులు ఏర్పాటు చేయడంతో అటువైపుగా వెళ్లేందుకు వీలుగా ఉండటంతో ప్రజలు వినియోగిస్తున్నారు. గతంలో చుట్టూ తిరిగి రావాల్సి ఉండటం, ఇదే దగ్గరి కావడంతో ఈ దారిని ప్రయాణాలకు వీలుగా వాడుతున్నారు. ఐదు కిలోమీటర్ల రహదారి పూర్తిగా దెబ్బతింది. చినుకు పడినా రోడ్డు బురదగా మారి గుంతల్లో నీరు నిలిచిపోతోంది. పెద్ద పెద్ద గుంతలు నడిచేందుకు వీలుగా కూడా లేని పరిస్థితి నెలకొంది.

తరచూ ప్రమాదాలు..

ఈ రోడ్డు దెబ్బతినడంతో వాహనదారులు రాత్రి సమయాల్లో గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ గ్రామం మీదుగా బేతపూడి, గుండాలపాడు గ్రామాల ప్రజలు వివిధ పనులు కోసం వస్తుండంతో తీవ్రంగా ఇక్కట్లు పడుతున్నారు.

దెబ్బతిన్న గుండాలపాడు రోడ్డు..

నుదురుపాడు రైల్వే స్టేషన్ మీదుగా గుండాలపాడు, బేతపూడి వెళ్లేందుకు వీలుగా ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతింది. కంకరరాళ్లు పైకిలేచి పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. రైలు ప్రయాణికులు ఈ రోడ్డులోనే తమ గ్రామాలకు చేరుకోవాలి. ద్విచక్ర వాహనదారులు ఈ రోడ్డున రావాలంటే నానా ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. ఏళ్లు గడుస్తున్నా దీనిని ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు స్పందించి, ఈ రోడ్లుకు మరామ్మతులు నిర్వహించడం కాని నూతనంగా రోడ్డు వేయడంకాని చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు



జూట్ బ్యాగులు అందజేస్తున్న రిసోర్స్ పర్సన్ ఝూన్సీ

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ ఎస్పీ ఝూన్సీ, రహమాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశామని, ఇందులో భాగంగా మహిళలకు చట్టాలు, ప్రత్యేక స్థానాలు, ప్రభుత్వ సహాయ సహకారాలు ఏ విధంగా ఉంటాయో వివరించామని తెలిపారు. ప్రతి మహిళా చట్టాలను తెలుసుకుని వినియోగించుకోవాలని సూచించారు. జూట్ బ్యాగులు అందజేశారు. కార్యాలయ సూపరింటెండెంట్ చంద్రమోహన్, లీగల్ కమిటీ సభ్యులు మహబూబ్, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్

తాడికొండ: తాడికొండ మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ సోమవారం శంకుస్థాపన చేశారు. మండలంలోని కంతేరు గ్రామంలో రూ.10 లక్షలు, పొన్నెకల్లు రూ.14లక్షలు, దామరపల్లి రూ.5లక్షలు, ఫణిదరం రూ.9 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పల్లె పండుగ– పంచాయతీ వారోత్సవాలలో భాగంగా అభివృద్ధి పనులకు కూటమి సర్కారు శ్రీకారం చుట్టిందన్నారు. మార్గ మధ్యంలో రోడ్లు అధ్వానంగా ఉండటాన్ని చూసిన ఎమ్మెల్యే ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేయాలని సూచించారు. పొన్నెకల్లు, ఫణిదరం సర్పంచ్‌లు నూకతోటి మేరిమ్మ, శివ కోటేశ్వర రావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ శేఖర్ నాయకులు పాల్గొన్నారు.

యువ వైఖానస అసోసియేట్స్ ఆరంభం

కన్వీనర్‌గా డాక్టర్ అనిల్ కుమార్



యువ వైఖానస అసోసియేట్స్‌ను ప్రారంభిస్తున్న దీవి లక్ష్మీ నరసింహాచార్యులు

తెనాలి: శ్రీవైఖానస సేవా సంఘం, తెనాలికి అనుబంధంగా యువ వైఖానస అసోసియేట్స్ ఆరంభమైంది. స్థానిక గంగానమ్మపేటలోని వేణుగోపాలస్వామి దేవస్థానం ప్రాంగణంలో సోమవారం సేవాసంఘం గౌరవాధ్యక్షుడు, 'వైఖానస ఆగమబ్రహ్మ' దీవి లక్ష్మీ నరసింహాచార్యులు నూతన విభాగాన్ని ప్రారంభించారు. కన్వీనర్ గా డాక్టర్ నారాయణ అనిల్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 15 మంది కో–కన్వీనర్లుగా నియమితులయ్యారు. సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ మేడూరు శ్రీనివాసమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైఖానస యువతీ యువకులను అసోసియేట్స్‌లో సభ్యులుగా చేర్చి వారి ద్వారా వైఖానసులకు 15 అంశాలతో కూడిన సేవలను అందించేందుకు నిర్ణయించారు. నవంబర్ 24న అసోసియేషన్ ప్రత్యేక సమావేశాన్ని తెనాలిలో ఏర్పాటుకు తీర్మానించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ తమిరిశ రఘు, ప్రధాన కార్యదర్శి వేదాంతం మాధవ కుమార్ పర్యవేక్షించారు.

ప్రతి ఒక్కరికి బ్యాంకు ఖాతా ఉండాలి



మేడికొండూరు: పేరేచేర్ల కమ్యూనిటీ హాల్‌లో సోమవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో ఖాతాదారుల ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో అనేక అవకాశాలున్నాయన్నారు. సబ్సిడీ, ముద్ర రుణాలు, బీమా పాలసీలను ఉపయోగించుకొని అందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. సంస్థ రిసోర్స్ పర్సన్ కె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలని, ఆ ఖాతానే పొదుపునకు కారణమవుతుందని చెప్పారు. బ్యాంక్ సేవల్ని ఉపయోగించుకోవాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ షేక్ బాజీ, డ్వాక్రా సీసీ షేక్ కరిముల్లా, యానిమేటర్లు పర్వీన్, దుర్గ, మల్లీశ్వరి, సుధ, శ్రీదేవి, మహముద, ఖాతాదారులు, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు సహాయ కేంద్రం ప్రారంభం

చేబ్రోలు: చైతన్యవంతులైన పట్టభద్రులు ప్రజాపక్షం వహించే ప్రజా మేధావులను ఓటు వేసి చట్టసభలకు పంపడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి తోడ్పడాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర రావు తెలిపారు. చేబ్రోలు యూటీఎఫ్ మండల కార్యాలయంలోని ఉపాధ్యాయ భవన్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు సహాయ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కృష్ణ– గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలలో డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని యూటీఎఫ్ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ రాజు, పి.పార్థసారథి కోరారు. 2021వ సంవత్సరం, అక్టోబర్ 31వ తేదీ లోగా డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. నవంబర్ 6 లోగా ఓటర్‌గా నమోదు చేసుకోవచ్చనని తెలిపారు.

దుగ్గిరాలలో 'పల్లె పండుగ'



గొడవర్రులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ షేక్ జబిన్

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం పల్లె పండగ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ షేక్ జబిన్ ముఖ్య అతిథిగా పాల్గొని, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం కింద ఇప్పటి వరకు పెదకొండూరుకు రూ.31.23 లక్షలు, గొడవర్రుకు రూ.35.74 లక్షలు, వీర్లపాలేనికి రూ.19.09 లక్షల అభివృద్ధి పనులు చేశామని, ఆయా గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షురాలు కేశినేని అనిత, జనసేన పార్టీ అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు ఎం.సౌజన్య, ఉమాదేవి, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ శివకుమార్, మండల స్పెషల్ అధికారి సాయికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, విస్తరణ అధికారి కేజే నెహ్రూ, పంచాయితీ రాజ్ ఏఈ తోట గోవర్ధన రావు, ఏపీఓ సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

మహంకాళీ ఆలయానికి రూ.2లక్షల విరాళం





దాతలకు అమ్మవారి చిత్రపటాలు అందజేస్తున్న అందజేస్తున్న ఈఓ చిన వెంకటరెడ్డి

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసిన మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి దాతలు సోమవారం రూ.2,01,117లు విరాళమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి మాట్లాడుతూ దనాల రాజామారావు మహంకాళి అమ్మవారికి రూ. 1,00,001లు, ఈవూరి రామాంజనేయులు రూ.1,01,116 ఆలయ అభివృద్ధి నిమిత్తం అందజేశారని చెప్పారు. అనంతరం దనాల రాజారావు, ఈవూరి రాంజనేయులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆయన తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకుల పంపిణీ

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ శ్రీకాంత్ నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో పనిచేస్తున్న 400 మందికి మంగళగిరి అక్షయపాత్ర ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశామని, వరదల సమయంలో పారిశుద్ధ్య కార్మికులు ఎంతో శ్రమించి పరిసరాలను పరిశుభ్రంగా చేశారని చెప్పారు. అక్షయపాత్ర వారు పారిశుద్ధ్య కార్మికులకు కూడా నిత్యావసర సరుకులు అందజేసేందుకు ముందుకు రావడంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఒక్కొక్కరికి 5 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, లీటరు నూనె, కేజీ పంచదార, కేజీ బెల్లం, కేజీ ఉల్లిపాయలు, ఇతర నిత్యావసర సరుకులు అందజేశామని పేర్కొన్నారు. ఈ ఒక్క ప్యాకెట్ 15 రోజుల పాటు ఆహార పదార్థాలను తయారు చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్, మేస్త్రీలు హనుమంతరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో తెనాలి చిన్నారుల నృత్యం



తెనాలి: టీటీడీ నిర్వహణలో అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన తిరుమల 'శ్రీవారి' బ్రహ్మోత్సవాల్లో పట్టణానికి చెందిన ప్రముఖ కూచిపూడి యువనర్తకి ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య శిష్యబృందానికి నాట్యం చేసే అవకాశం లభించింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో 12వ తేదీ రాత్రి తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో కూచిపూడి నృత్యప్రదర్శన చేశారు. అన్నమాచార్య కీర్తనలకు తెనాలి చిన్నారులు కూచిపూడి సంప్రదాయరీతిలో లయబద్ధంగా నర్తించారు. అన్నమాచార్య ప్రాజెక్టు అధికారుల అభినందనలను అందుకున్నారు. అనంతరం ప్రాజెక్టు అధికారులు నృత్యగురువు తేజస్విప్రఖ్య, ఆమె శిష్యబృందానికి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

'చలపతి' అధ్యాపకుడిగా డాక్టరేట్




అధ్యాపకుడు తాటి రాఘవయ్య

తాడికొండ: మోతడకలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో మాథ్స్ అండ్ స్టాటిస్టిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న తాటి రాఘవయ్యకు ఏఎన్‌యూ డాక్టరేట్ ప్రధానం చేసిందని ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీ ఆచార్యులు ప్రొఫెసర్ ఎస్ విశ్వం పర్యవేక్షణలో అన్ డిఫరెంట్ ఎస్టిమేషన్ మెథర్డ్ ఆఫ్ పెరా మెటర్స్ ఫర్ యూ క్వాడ్రాటిక్ డిస్ట్రిబ్యూషన్ అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించినందుకు గాను గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకుడు తాటి రాఘవయ్యను చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, కార్యదర్శి వై.సుజిత్ కుమార్, పలువురు అధ్యాపకులు అభినందించారు.

వెన్నెముక.. అశ్రద్ధ చేయవద్దు

- ఆధునిక జీవన శైలితో పెరుగుతున్న సమస్యలు
- అందుబాటులో ఆధునిక వైద్యసేవలు
- 16న వరల్డ్ స్పయిన్ డే



గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరిలో వెన్నెముక సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. పాఠశాల విద్యార్థులు కూడా అధిక బరువు బ్యాగులను మోయడం వలన, కళాశాల యువత తరగది గదుల్లో ఎక్కువ సేపు కూర్చోలేక వెన్నుముక సమస్యతో వైద్యులను సంప్రదిస్తున్నారు. సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి మెరుగైన వైద్యం అందించడం ద్వారా నయం చేయవచ్చు. అవగాహన కలిగించేందుకు ప్రతి ఏడాది అక్టోబరు 16న వరల్డ్ స్పయిన్ డే నిర్వహిస్తున్నారు.

జిల్లాలో బాధితులు

గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ 30 మంది వెన్నెముక సంబంధిత సమస్యలతో ఆర్థోపెడిక్ వైద్యులను సంప్రదిస్తున్నారు. జిల్లాలో 35 మంది స్పయిన్ సర్జన్స్, 10 మంది న్యూరోసర్జన్స్ ఉన్నారు. ప్రతిరోజూ ఒక్కో వైద్యుడి వద్దకు 10 మంది వరకు వెన్నెముక సమస్యలతో చికిత్స కోసం సంప్రదిస్తున్నారు.

సహజ అరుగుదల

సాధారణంగా వయస్సు పెరిగే కొద్ది వెన్నుపూస మధ్యలో ఉండే డిస్క్‌లు అరిగి గ్యాప్ ఏర్పడుతోంది. గ్యాప్ ఏర్పడిన సమయంలో కొత్తగా కండరం పెరగడం, లేదా ఎముక పెరగడం జరిగి నడుము నొప్పి, తుంటి నొప్పి, కాలు జాలు, కాలు తిమ్మిరి, కాలు పటుత్వం తగ్గిపోవడం, మల, మూత్రాలను ఆపుకోలేక నియంత్రణ కోల్పోవడం జరుగుతోంది. డిస్క్ జారినప్పుడు గజ్జల్లో నొప్పి, తొంటి నొప్పి వస్తుంది. కాళ్లల్లో స్పర్శ తగ్గిపోతోంది. వెన్నెముక ఆకారం మారిపోతోంది.

90శాతం అవే తగ్గిపోతాయి

వెన్నెముకలో డిస్క్ సమస్యలు వచ్చిన మొదటి సారి నూటికి 90 శాతం అవే తగ్గిపోతాయి. తొలిసారి డిస్క్ సమస్య వచ్చినప్పుడు విశ్రాంతి తీసుకోవాలి. 48 గంటల పాటు నడుముకు విశ్రాంతి ఇస్తే నొప్పి తగ్గుతోంది. వేడి నీళ్ల కాపడం, ఫిజియోథెరపి, నొప్పి నివారణ మాత్రలు కొద్దిపాటి వ్యాయామం ద్వారా మూడు వారాల్లో నొప్పి తగ్గిపోతుంది. రెండో సారి సమస్య వస్తే 50శాతం ఎలాంటి వైద్యం చేయకుండానే తగ్గిపోతాయి. మొండిగా సమస్య ఉన్నవారికి తుంటికి ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా మూడు వారాల్లో నొప్పి తగ్గిపోతుంది. మూడోసారి మరలా డిస్క్ సమస్య వస్తే 20 శాతం మాత్రమే వాటంతట అవి తగ్గుతాయి. వీటికి తప్పనిసరిగా వైద్యం చేయాల్సి ఉంటుంది. కీ హోల్ సర్జరీ ద్వారా ఎముక, కండ కట్ చేయకుండా చిన్న రంధ్రం ద్వారా జరిగిన ఎముకను సరిచేసి నొప్పిని నివారించవచ్చు.

ఇవన్నీ అపోహలే

వెన్నుముక సర్జరీలు సురక్షితం కాదనే అపోహ ప్రజల్లో ఉంది. సర్జరీ చేసే సమయంలో నరాలు దెబ్బతింటే జీవితాంతం నడక ఉండదని భావిస్తారు. ఒకసారి సర్జరీ చేస్తే మరలా మరలా సర్జరీ చేయాల్సి వస్తుందనే అపోహ ప్రజల్లో ఉంది. సర్జరీ చేయించుకున్నవారు వంగకూడదు, బరువు ఎత్తకూడదు, జీవితాంతం జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు భావిస్తారు. ఇవన్నీ కేవలం అపోహలు మాత్రమే.

సమస్యలకు కారణాలు

ప్రతి మనిషి తన జీవిత కాలంలో ఏదో ఒక రోజు వెన్ను నొప్పితో బాధపడుతున్నారు. ఎక్కువ సమయం కంప్యూటర్‌ల ముందు కూర్చుని పనిచేయటం, స్మార్ట్‌ఫోన్‌లు వినియోగిస్తూ ఎక్కువ సేపు ఒకేచోట కూర్చుండిపోవటం, ఊబకాయం, శారీరక శ్రమలేకపోవటం, జీవనశైలిలో మార్పులు, ధూమపానం, కార్లు, ద్విచక్రవాహనాలపై ఎక్కువ దూరాలు ప్రయాణాలు చేయటం, గుంతలు ఉన్న రోడ్లపై వాహనాలు నడపటం, ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడిపేవారిలో వెన్నెముక సమస్యలు వస్తున్నాయి.

ఆధునిక శస్త్ర చికిత్సలు



వెన్నెముక శస్త్రచికిత్సల్లో అత్యాధునిక వైద్య పద్ధతులు నేడు అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్ న్యావిగేషన్, న్యూరోమానిటరింగ్, ఎండోస్కోప్, కీహోల్ ఆపరేషన్లతో వెన్నుముక సమస్యలను చాలా సులువుగా నయం చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణలో స్టాండింగ్ ఎమ్మారై వంటి ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ప్రతిరోజూ వ్యాయామం చేయటం, బరువు నియంత్రణలో పెట్టుకోవటం, కూర్చుని పని చేసేవారు ప్రతి రెండుగంటలకు ఒకసారి లేచి నడవటం, ఎక్కువసేపు ఒంగి పనులు చేయకుండా ఉండటం, అధిక బరువులు ఎత్తకుండా ఉండటం ద్వారా సమస్యలు దరిచేరవు.

డాక్టర్ జె.నరేష్‌బాబు,
సీనియర్ స్పయిన్‌సర్జన్, గుంటూరు